

ప్రజాశక్తి
సోమవారం 24 ఏప్రిల్ 2023
5
పార్వతీపురం మన్యం



గురుకులాల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

సీతానగరం: ప్రతిభా పాఠశాల, కళాశాలలో 8వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరుటకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలను పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ తనిఖీ చేశారు. జోగింపేట ప్రతిభా పాఠశాలలో ప్రవేశ పరీక్షలు జరిగాయి. 8 తరగతి ప్రవేశ పరీక్షకు 153 మంది దరఖాస్తు చేయగా 132 మంది హాజరయ్యారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకు 270 మంది దరఖాస్తు చేయగా 221 మంది హాజరయ్యారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న పిఒ

జంపరకోట జలాశయం పూర్తయ్యేనా!

అందుబాటులో ఉన్న వనరులు సద్వినియోగం చేసుకుంటే రైతులకు సాగునీరు అందించడం అసాధ్యమేమీ కాదు. అయితే ప్రజాప్రతినిధుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రకృతి వనరులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నాం. అందుకు నిదర్శనం జంపరకోట జలాశయం. ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభించి దశాబ్ధాలు గడిచిపోతున్నా నేటికీ పూర్తికాని పరిస్థితి. దీంతో రైతులకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది.



ఇదే జంపరకోట జలాశయం

- రూ.ఐదు కోట్లు నీటిపాలు
- దశాబ్ద కాలంగా నిలిచిన పనులు
- 2,100 ఎకరాలకు అందని సాగునీరు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

మండలంలోని శివారు ప్రాంత రైతులకు సాగునీరందించే ఉద్దేశ్యంతో బడ్డుమాసింగి పంచాయతీలో జంపరకోటలో రిజర్వాయర్ నిర్మాణాన్ని 1988లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రారంభించారు. అప్పట్లో కేవలం రూ.2.50 కోట్లు అంచనా వ్యయంతో ఈ పనులు ప్రారంభించారు. గిరిజన, గ్రామీణ ప్రాంత రైతుల ప్రయోజనార్ధ అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిధులు మంజూరు చేసినప్పటికీ నేటికీ ప్రాజెక్టు పనులు పూర్తికాలేదు.

రూ.ఐదు కోట్లు వ్యయం...

జంపరకోట రిజర్వాయర్ నిర్మాణానికి రూ.2.50 కోట్లు అంచనా వ్యయంతో ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు రూ.5 కోట్లు ఖర్చుచేశారు. గడువులోపు ప్రాజెక్టు పనులు పూర్తిచేసి ఉంటే రైతులకు, ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరేది. పనులు ప్రారంభించిన కొద్దికాలనికే పనులు నిలిచిపోయాయి. రూ.5 కోట్లుతో 35శాతం పనులు మాత్రమే పూర్తిచేశారు. అయినప్పటికీ ఈ పనులతో రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. మూడు వైపుల కొండలు ఉండడంతో అడ్డంగా మట్టికట్ట నిర్మాణం మాత్రమే జరిగింది. జంపరకోట రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే తమకు సాగునీటి కష్టాలు తీరుతాయని భావించిన రైతుల ఆశలు నిరాశగానే మిగిలాయి.

ఆగుతూ...సాగుతూ...

1989లో నిలిచిన జంపరకోట రిజర్వాయర్ పనులు ఎట్టకేలకు కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞంలో భాగంగా అప్పటి సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.15 కోట్లు మంజూరు చేయడంతో తిరిగి పనులు 2008లో ప్రారంభమయ్యాయి. జంపరకోట రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా పనులు ప్రారంభించడంతో అప్పట్లో నిర్వాసితులు పనులను అడ్డుకున్నారు. జంపరకోటకు చెందిన 39మంది గిరిజనులకు పూర్తిస్థాయి పరిహారం అందకపోవడంతో వారు అప్పట్లో పనులు జరిపించేందుకు సుముఖత చూపలేదు. చివరికి అధికారులు 2010లో 39మంది నిర్వాసితులకు రూ.28.48 లక్షలు పరిహారం పంపిణీ చేయడంతో పనులకు అడ్డంకి తొలగింది. అయితే అప్పట్లో గుత్తేదారులు పనులు ప్రారంభించేందుకు ఆసక్తి చూపలేదు. నిర్మాణ సామాగ్రి ధరలు భారీగా పెరగడంతో ఈ నిధులతో పనులు చేపట్టలేమని భావించిన గుత్తేదారుడు పనులను అర్థాంతరంగా నిలిపివేశారు. దీంతో రూ.ఐదు కోట్ల వ్యయంతో జరిగిన పనులు కూడా ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. కోట్లాది రూపాయలతో జరిగిన మట్టి పనులు వర్షాలకు పూర్తిగా పాడయ్యాయి.

వృథాగా పోతున్న గెడ్డనీరు...

జంపరకోట రిజర్వాయర్‌కు ఏడాది పొడవునా జీవగెడ్డ ద్వారా కొండలపై ఉన్న నీరు చేరుతుంది. ఈ నీటిని ప్రాజెక్టులో నిల్వ చేసి అవసరమైన సమయాల్లో రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రస్తుతం 32 ఏళ్లుగా ఈ గెడ్డద్వారా నీరు వృథాగా నాగావళి నదిలో కలిసిపోతుంది. కనీసం కాలువ ద్వారా ఈ నీటిని పంట పొలాలకు మళ్లించినా వేల ఎకరాల్లో పంట సాగవుతుందని రైతులు చెబుతున్నారు.

గాల్లో కలిసిన పాలకుల హామీలు...

కేంద్రమంత్రి హోదాలో వైరిచర్ల కిశోర్‌చంద్రదేవ్ 2012లో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఈ ప్రాంతానికి వచ్చిన ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు మండలస్థాయి ప్రజాప్రతినిధులు కూడా జంపరకోట జలాశయం పనులపై హామీలిచ్చినా నేటికీ నెరవేర్చలేకపోయారు. అప్పటి పాలకపక్షంలో సిఎం చంద్రబాబునాయుడు, కిమిడి కళావెంకటరావు సైతం జంపరకోట పనులు పూర్తిచేస్తామని చెప్పినప్పటికీ ఏ మాత్రం హామీ అమలు చేయలేకపోయారు. ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో నవగాం దగ్గర జంపరకోట పనులు పూర్తిచేస్తామని ప్రకటించినప్పటికీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కావస్తున్నా ఏమాత్రం చేయలేదు. దీంతో పాలకుల హామీల పట్ల రైతులు పెదవి విరుస్తున్నారు.



మట్టికట్ట కొట్టుకుపోయిన దృశ్యం

ఏటా సాగునీటికి కష్టాలే...

జంపరకోట రిజర్వాయర్ పూర్తికాకపోవడంతో మండలంలో రైతులకు ఏటా సాగునీటి కష్టాలు తప్పడం లేదు. మండలానికి ఏకైక సాగునీటి ఆధారమైన తోటపల్లి ఎడమకాలువ ఉన్నప్పటికీ ప్రాజెక్టుకు శివారు మండలం కావడంతో పూర్తిస్థాయిలో సాగునీరందడం లేదు. దీంతో రైతులు సాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జంపరకోట రిజర్వాయర్ పనులు పూర్తయితే మండలంలో బడ్డుమాసింగి, ఎల్ఎల్‌పురం, కోటిపల్లి, భాసూరు, గుడివాడ తదితర గ్రామాల్లో సుమారు 2,100 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

గుత్తేదారులు ముందుకురాక...

జంపరకోట రిజర్వాయర్ పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. 2010లో నిర్వాసితుల సమస్య పరిష్కరించిన అనంతరం పనులు ప్రారంభించాలని గుత్తేదారుడుకు అధికారులు కోరినప్పటికీ బహిరంగ మార్కెట్‌లో నిర్మాణ సామాగ్రి వ్యయం పెరగడంతో బడ్జెట్ కూడా పెంచాలని ఒత్తిడి తీసుకువచ్చారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎవరూ ముందుకు రావడం లేదు. అయితే అంచనా వ్యయం పెరిగిపోవడంతో మరో కొత్త టెండర్ వేయాల్సి ఉంది. ప్రభుత్వం దీనిపై స్పందించి టెండర్ పిలిస్తే తప్ప రైతులకు ఈ ప్రాజెక్టు కలగానే మిగులుతుంది.

ఈసారి కూడా నిరాశే....

జంపరకోట ప్రాజెక్టుకు నిధులు కేటాయింపు విషయంలో ఈ ఏడాది కూడా రైతులకు నిరాశే మిగిల్చింది. ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఈ ప్రాంత రైతాంగం ఎదురు చూసింది. అయితే బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో రైతులకు ఈ ఏడాది కూడా ఇబ్బందులు తప్పే పరిస్థితి లేదు. 2100 ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టు విషయంలో పాలకులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఈ ప్రాంత రైతులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. ఈ ప్రాంతానికి చెందిన నాయకులు కూడా దీనిపై దృష్టిపెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రతిపాదనలు పంపించాం

ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టు పరిస్థితిని మరోసారి ప్రణాళిక రూపంలో తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. అయితే అక్కడ నుంచి ఎటువంటి ప్రతిపాదనలు రాలేదు. బడ్జెట్ కేటాయిస్తే మళ్లీ కొత్తగా టెండర్లు పిలవాల్సి ఉంది. అంతవరకు తామేమి చెప్పలేం.

డి.రవికుమార్, ఇరిగేషన్ డిఇఇ.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

మోడీని గద్దె దింపండి

ప్రచారభేరిలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కేంద్రంలో అరాచక పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపి దేశాన్ని కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రజలకు పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలపై రాజకీయ ప్రచారం మండలంలో ఆదివారం చేపట్టారు. రాజకీయ ప్రచారంలో భాగంగా ఎల్విన్ పేట పంచాయతీ ఎస్ కే పాడు చర్చి వద్ద ఆయన మాట్లాడుతూ మోడీ నిరంకుశ విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. రాజ్యాంగంపై దాడి చేస్తూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందన్నారు. తొమ్మిదేళ్ల మోడీ పాలనలో నిరుద్యోగ యువతకు ఉపాధి కరువైందన్నారు. మరోవైపు నిత్యవసర వస్తువులు, పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు దేశ ఆర్థిక వ్యవస్థను తాకట్టు పెట్టేలా ఆర్థిక విధానాలను రూపొందిస్తుందన్నారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్న వైసిపి, టిడిపి, జనసేన నాయకులు బిజెపిని పల్లెత్తి మాట్లాడడం లేదన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోలక అవినాష్, నాయకులు మండంగి రమణ మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 1/70, అటవీ హక్కు, పిసా చట్టాలను పటిష్టంగా అమలు జరపడం లేదన్నారు. జిఒ 3ను పూర్తిగా ఎత్తివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిసిసి, ఐటిడిఎలున్నా గిరిజన అభివృద్ధి శూన్యమన్నారు. ఈనెల 25న గుమ్మలక్ష్మీపురంలో బిఎస్ఆర్ కళ్యాణ మండపం వద్ద బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై జరుగు సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు హాజరవుతారని, కావున ప్రజలంతా పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆరోజున గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కల్యాణమండపం వరకు భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. ప్రచారభేరీలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మండంగి శ్రీనివాసరావు, ఎం.సన్యాసిరావు, పి.మోహన్ రావు, వెంకట్రావు, పాల్గొన్నారు.

తాడికొండ పిహెచ్‌సి పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి జగన్నాథం ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో ఉన్న అన్ని విభాగాల్లో తనిఖీలు నిర్వహించారు. రోగ నిరోధక టీకాలను పరిశీలించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. మందులు నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పర్యవేక్షించారు. ఆసుపత్రి ఆవరణంతా కలియ తిరుగుతూ శుభ్రత పై పలు సూచనలు చేశారు. సిబ్బంది అంతా ముఖహాజరును తప్పక పాటించాలని ఆదేశించారు. విధులు పట్ల అంకితభావంతో పనిచేయాలని అప్పుడే రోగులకు మన మీద నమ్మకం పెరిగి ఆసుపత్రికి వచ్చి సేవలు పొందుటకు సానుకూలంగా ఉంటారని సిబ్బందికి సూచించారు.

ఉత్తమ పంచాయతీ ఒక్కటీ లేకపోయే?

- అన్ని విభాగాల్లోనూ శూన్యం..
- సర్వేలో తేలిపోయిన మండలం

ప్రజాశక్తి - మక్కువ

సంకల్ప బలం ఉంటే సాధించలేనిది అంటూ ఏదీ ఉండదని జగమెరిగిన సత్యం. గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా దీంట్లో రాజకీయ నాయకులతో పాటు అధికారుల పాత్ర అత్యంత కీలకం. రాష్ట్రంలో ఆయా నిధులు మండల పంచాయతీల జనాభా ప్రాతిపదికన కావచ్చు. ఇంకా ఇతర అంశాలపై ఆధారపడి మంజూరవుతుంటాయి. ఇక్కడ ఉన్న వాటితో అభివృద్ధి చెందేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకొనే అధికారం పాలకులకు ఉంటుంది. దీనికి అనుగుణంగా అధికారులు చిత్తశుద్ధి కనపరిస్తే అంతా అభివృద్ధి చెందుతుంది. మండలంలో 21 గ్రామపంచాయతీలున్నప్పటికీ ఇటీవల పంచాయతీ శాఖ అధికారులు చేపట్టిన సర్వేలో ఏ ఒక్క పంచాయతీ వివిధ విభాగాల్లో ఎంపిక కాకపోవడం మండలంలోని పంచాయతీల ఏ దుస్థితిలో ఉన్నాయో ఇట్టే అర్థమవుతుంది. పక్క మండలాలు సైతం ర్యాంకులు సాధించుకోవడం అక్కడ వారి పరిపాలన విధానం, దక్షత ఏ విధంగా ఉందో దీన్ని బట్టి అర్థమవుతుంది. మండలంలో చాలావరకు అపారిశుధ్యంలోనే పంచాయతీలు కొట్టుమిట్టాడు తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి దాపురించింది. పక్క మండలాల్లో వర్తించే విధులు, నిధులు ఇక్కడకు వర్తించవా అని పలువురు ఆక్షేపిస్తున్నారు. మండలంలో నీటి వనరులున్నప్పటికీ కనీసం ఆ విభాగంలోనూ పంచాయతీలకు ర్యాంక్ సాధించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మండలంలో అధికారపక్ష పార్టీ ఆధీనంలోనే ఎక్కువ పంచాయతీలు ఉన్నాయి. మరోవైపు పంచాయతీల అభివృద్ధి కుంటుపడ్డానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణం కూడా ఉందన్న చర్చ జరుగుతుంది. ఏది ఏమైనా పాలకుల్లో అభివృద్ధి ఆకాంక్ష కొంతమేరకు సడలిందన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా చిత్తశుద్ధితో అధికారులు, అంకితభావంతో పాలకులు సమిష్టిగా పాలన సాగిస్తే అవార్డులు అలవోకగా పొందవచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లోనైనా పంచాయతీలు అభివృద్ధి చెంది అవార్డులు అందుకోవాలని పలువురు కోరుతున్నారు

ఉత్తమ గ్రామ పంచాయతీలు 14

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వివిధ విభాగాల్లో అభివృద్ధి సాధించిన పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ప్రకటించింది. ఇందులో జిల్లాకు చెందిన 14 గ్రామ పంచాయతీలు వివిధ విభాగాల్లో ర్యాంకులు దక్కించు కున్నాయని జిల్లా గ్రామ పంచాయితీ అధికారి బలివాడ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. తొమ్మిది విభాగాలు (థీమ్‌లు)లో ర్యాంకులు ప్రకటించారని ఆయన చెప్పారు. ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఈ ర్యాంకులు ప్రకటించారని ఆయన పేర్కొన్నారు.

పేదరికంలేని, మెరుగైన జీవనోపాధుల విభాగంలో పార్వతీపురం మండలం చిన బొండపల్లి గ్రామ పంచాయతీకి రెండో ర్యాంకు దక్కింది. ఆరోగ్యవంతమైన గ్రామ పంచాయతీగా విభాగం గుమ్మలక్ష్మీపురం పంచాయతీకి మొదటి ర్యాంక్ లభించింది. నీటి సమృద్ధి గల గ్రామం విభాగంలో పాలకొండ మండలం వెలగవాడ, సీతానగరం మండలం జోగింపేట పంచాయతీలకు మొదటి ర్యాంక్ లభించాయి. పరిశుభ్రమైన హరిత గ్రామం విభాగంలో సీతానగరం మండలం జోగింపేట పంచాయతీకి మూడో ర్యాంక్, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు కలిగిన గ్రామంలో కురుపాం మండలం పెద్ద గొత్తిలి పంచాయతీకి మొదటి ర్యాంక్, గురుగుబిల్లి మండలం గురుగుబిల్లికి రెండవ ర్యాంక్ దక్కింది. సామాజికంగా సురక్షితమైన గ్రామం విభాగంలో గరుగుబిల్లి మండలం కొత్తపల్లి మొదటి ర్యాంక్ రాగా, సుపరిపాలన కలిగిన గ్రామం విభాగంలో బలిజిపేట మండలం మిర్తివలస గ్రామ పంచాయతీకి మొదటి, పెదపెంకికి మూడో ర్యాంక్, సీతానగరం మండలం జోగింపేటకు రెండో ర్యాంకు లభించింది. లింగ సమానత్వంతో మరింతగా గ్రామాభివృద్ధి విభాగంలో సీతానగరం మండలం జిఎంవలస గ్రామపంచాయతీకి రెండవ ర్యాంక్, దయానిది పురం గ్రామపంచాయతీ, సీతంపేట మండలం సీతంపేట గ్రామపంచాయతీ మూడవ ర్యాంక్ లు దక్కించుకున్నాయి. 14 గ్రామ పంచాయితీలు ర్యాంకులు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఎక్కువ పంచాయతీలు ర్యాంకులు సాధించి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని ఆయన అన్నారు. అంకితభావంతో మంచి సేవలందిస్తే వాటికి ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని ఆయన చెప్పారు.



పలగరలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

అందరివాడు అంబేద్కర్

ప్రజాశక్తి - బలిజిపేట

భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బాబా సాహెబ్ అందరి వాడని వక్తలు కొనియాడారు. మండలంలోని పలగరలో గల గుడివాడకాలనీలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. వేదాంత డెవలపర్స్ అధినేత సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ జనరల్ మేనేజర్ ఎస్.మసిలామణి, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ వెలిది సిబ్బంది ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మధరావు అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశంలో పాలకులకు దిశా నిర్దేశం చేసిన వారు అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ ఎంతో కష్టపడి రచించిన ఈ రాజ్యాంగాన్ని ప్రస్తుతం దేశంలో పాలకులు రాజ్యాంగ విలువలకు తిలోదకాలిస్తున్నారని, వారి నుంచి పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. విగ్రహ దాత సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక గ్రామంలో అంబేద్కర్ విగ్రహం పెట్టడమే తమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మన జీవన విధానాల మారాలంటే, పిల్లలను బాగా చదివించుకోవాలని తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు గొంగాడ లక్ష్మణరావు, గుడివాడ. రాము మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయం కోసం అంతా శ్రమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బలిజిపేట అంబేద్కర్ పోరాట సమితి నాయకులు. మారిశెట్టి. ఆనందరావు, ప్రధాన కార్యదర్శి బోనెల రామారావు, పెద్దఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఉపాధిహామీ'తో పోడు భూముల అభివృద్ధి

- 1.68 లక్షల మందికి జాబ్‌కార్డులు
- కోటీ 6 లక్షల పనిదినాలు కల్పన
- 'ప్రజాశక్తి'తో డ్వామా పీడీ కె.రామచంద్రరావు ముఖాముఖి

పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజనుల పోడు భూముల అభివృద్ధికి ఉపాధిహామీ చట్టం ఎంతో దోహదపడుతుందని జిల్లా జలయాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని రైతులకు, వ్యవసాయ కార్మికులకు పనులు పుష్కలంగా లభిస్తున్నాయన్నారు. పనుల్లేకుండా ఎవరూ ఉండకూడదన్న లక్ష్యంతో జిల్లాలో ఇప్పటి వరకూ కోటీ 68లక్షల మందికి జాబ్‌కార్డులు మంజూరు చేశామన్నారు. ఇందులో భాగంగా గతేడాది లక్ష్యానికి మించి కోటీ 6లక్షల పనిదినాలు కల్పించామని చెప్పారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండడం వల్ల పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. కూలీలెవరూ అస్వస్థతకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వీటితో పాటు మరిన్ని వివరాలకు 'ప్రజాశక్తి' ముఖాముఖికి వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే....

ప్రజాశక్తి - కలెక్టరేట్





జిల్లా వాసులకు ఉపాధి హామీ చట్టం ఎటువంటి ప్రయోజనం కల్పిస్తోంది?

మన్యం జిల్లాలో చాలావరకు వ్యవసాయం, కూలి పనులపై ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. ఉపాధి హామీ చట్టంతో గ్రామాల్లోని పేదలు, వ్యవసాయ కూలీలు, చిన్నసన్నకారు రైతులకు పనులు పుష్కలంగా లభిస్తున్నాయి. ఈ పథకం వల్ల అందరికీ ఉపాధి దొరుకుతుంది. ముఖ్యంగా పోడు భూముల అభివృద్ధికి ఎంతో దోహదపడుతోంది.

జిల్లాలో ఉపాధి హామీ పనులు ఈ సంవత్సరంలో ఏ ఏ ప్రాంతాల్లో మొదలయ్యాయి?

జిల్లాలో అన్ని మండల్లానూ ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయి. ఈ చట్టం నిబంధనల ప్రకారం పని కోరిన వెంటనే గ్రామసభ నిర్వహించి పని కల్పించాలి. రెండు పూటలా పని చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనాన్ని పొందవచ్చు.

జిల్లాలో మొత్తం ఎంతమందికి ఉపాధి హామీ కార్డులు ఉన్నాయి?

జిల్లాలో పరిధిలో 1.68లక్షల మందికి ఉపాధి కార్డులు ఉన్నాయి. వీరంతా 2021-22 ఏడాది కోటి 3లక్షల పనిదినాలు ఉపయోగించుకున్నారు. 2022-23 వరకు కోటీ 10లక్షల పనిదినాలు కల్పించాం. గత ఏడాది తొలుత 86లక్షల పనిదినాలు కల్పనే లక్ష్యంగా పెట్టుకున్నామని, అనంతరం లక్ష్యాన్ని కోటికి పెంచుకోగా, లక్ష్యాన్ని దాటి పని దినాలను కల్పించాం.

మన్యం ప్రాంతంలో ఉపాధి హామీ చట్టం వల్ల ఎంతవరకు ప్రయోజనం కలిగించనుంది?

జిల్లాలో అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన భూముల అభివృద్ధికి ఉపాధి హామీ చట్టం ఎంతో దోహదపడుతోంది. గిరిజనులు వారికి కేటాయించిన భూములను చదును చేసుకోవడం, గట్లు ఎత్తుకోవడం, మొక్కలు నాటుకోవడం వంటి పనులు చేయడంలో జిల్లాలో ఉపాధి పనులు లక్ష్యానికి మించి సాగుతున్నాయి.

జిల్లాలో లక్ష్యానికి మించి పని దినాలు కల్పించడానికి గల కారణం ఏమిటి?

వాస్తవానికి జిల్లాలో గిరిజన, మైదాన ప్రాంతాలు వేర్వేరు స్వభావంతో ఉంటాయి. మైదాన ప్రాంతంలో వర్షాకాలంలోనూ, ఖరీఫ్ సీజన్లోనూ పనులు తక్కువగా జరుగుతాయి. కానీ గిరిజన ప్రాంతంలో నిరంతరం ఉపాధి పనులు చేపడుతున్నాం. ఎందుకంటే మొట్ట ప్రాంతంలో వర్షం పెద్ద ఆటకం కాదు. పైగా తవ్వకానికి ఉపయోగకరంగా ఉంటుంది. అందువల్లే లక్ష్యాన్ని మించి పని చేయగలిగాం.

డిఇఒ సస్పెన్షన్‌పై నేడు ఆటా నిరసన

ప్రజాశక్తి - సాలూరు

పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి, ఇతర ఉపాధ్యాయుల సస్పెన్షన్‌కు నిరసనగా సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎపి ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జన్ని పైడిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ సస్పెన్షన్‌లు ఎత్తివేయాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలోని ఆదివాసీ ఉపాధ్యాయులంతా ఈ ర్యాలీలో పాల్గొనాలని ఆయన కోరారు.

పాలకొండ: అధికారుల అక్రమ సస్పెన్షన్లను వెంటనే రద్దు చేసి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఇచ్చిన పిలుపు మేరకు పాలకొండ మండల పరిధిలోగల అన్ని పాఠశాలలో ఉపాధ్యాయులంతా సోమవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవ్వాలని మండల ఎపిటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వాసుదేవరావు, సంపత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటలకు డీఈవో కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు జరిగే ర్యాలీలో పాల్గొనాలన్నారు.

నేటి నుంచి తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని అన్ని వీధులకు ఈనెల 24 నుంచి రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ అధికారి వి.రామచంద్రరావు ఆదివారం తెలిపారు. ఈ నెల 15వ తేదీన అంబేద్కర్ జంక్షన్ వద్దగల ప్రధాన రహదారి విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా రహదారి కాలువ నిర్మాణ పనులు చేపట్టేందుకు జెసిబి ద్వారా కాలువలు తవ్వకాలు జరుపుతుండగా ప్రధాన పైపులైను మరమ్మతులు గురైన విషయం తెలిసిందే. ఈ నెల 15 నుండి 23వ తేదీ వరకు రహదారి అవతల సాయి నగర్ కాలనీ, బార్నాల వీధి, తదితర వీధులకు తాగునీరు సరపరా నిలిచిపోయింది. ప్రధాన పైపులైను మరమ్మతులు పూర్తి చేయడం జరిగిందని 24 నుండి ఎదవిధిగా అన్ని వీధులకు రక్షిత పథకం ద్వారా తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు .

ప్రజాశక్తి
www.prajasakti.com



కాఫీ తోటలను పరిశీలిస్తున్న సిబిటియు నాయకులు

కాఫీ రైతులను ఆదుకోవాలి

పాచిపెంట: మండలంలోని కాఫీ గింజలకు గిట్టుబాటు ధర కల్పించి, రైతులను ఆదుకోవాలని సిబిటియు నాయకులు కె.ఈశ్వరరావు సతాబి పంచాయతీ ఉపసర్పంచ్ సారా లచ్చయ్య అధికారులను కోరారు. ఆదివారం వారు సతాబిలో సాగవుతున్న కాఫీ తోటలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాఫీ పిక్కలను కిలో రూ.250కు ప్రైవేట్ వ్యాపారులు విక్రయిస్తున్నారని, దీనివల్ల రైతులకు గిట్టుబాటు కావడం లేదన్నారు. మండలంలోని సతాబి, మెలియాపుకంచరు, తంగలం పంచాయతీల పరిధిలో కాఫీ పంట సాగవుతుందన్నారు. ఐటిడిఎ పిఒ స్పందించి ఈ పంటలపై రైతులను అవగాహన కలిగించాలని కోరారు. అలాగే గిరిజన కార్పొరేషన్ ద్వారా ధర నిర్ణయం గిట్టుబాటు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సతాబి వద్ద కాఫీ పంట ప్లాంటేషన్ ఏర్పాటు చేసి గిరిజన రైతులను ఆదుకోవాలన్నారు. ఈ పరిశీలనలో గిరిజన సంఘం నాయకులు శ్రీరాం పాల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ జిల్లాలో పర్యటించాలి

కలెక్టరేట్ : పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో రాష్ట్ర ఎస్‌టి కమిషన్ పర్యటించాలని చేయాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌టి కమిషన్ ఏర్పాటైన తర్వాత ఈరోజు వరకు పార్వతీపురం ఐటిడిఎలో పర్యటన చేయలేదన్నారు. ఈ ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని, పాలక వర్గ సమావేశం లేదని, గిరిజన సంక్షేమం, అభివృద్ధిపై చర్చే లేదని అన్నారు. ఐటిడిఎ స్పందనలో పిఒ ఉండే పరిస్థితి లేదని, గిరిజన సంక్షేమ నిధులు మళ్లింపులు జరుగుతున్నా పట్టించుకునే ప్రజా ప్రతినిధులు లేరని అన్నారు. ఇటువంటి అనేక అంశాలపై ఎస్‌టి కమిషన్ స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. కావున మన్యం జిల్లా పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఎస్‌టి కమిషన్ పర్యటన చేయాలని కోరారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

విద్యార్థులకు బహుమతులు

జియమ్మ వలస : మండలంలోని పెద మేరంగి జంక్షన్‌లో గల తిరుమల సాయి విద్యానికేతన్‌లో నవోదయ మోడల్ టెస్ట్‌లో విజయం సాధించిన విద్యార్థులకు సబ్ కలెక్టర్ నూరుల్ కమల్ ఆదివారం బహుమతులను అందజేశారు. మోడల్ టెస్ట్‌లో విజయం సాధించిన పదిమంది విద్యార్థులకు ఆయన చేతులు మీదుగా బహుమతులను అందజేశారు. తన్ను భాగ్యలక్ష్మి, లిఖిత, గుంట్రెడ్డి చాణక్య మొదటి మూడు స్థానాల్లో విజయం సాధించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సబ్ కలెక్టర్ కోరారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

సాలూరు : విద్యార్థి దశలోనే పిల్లలు పుస్తక పఠనం అలవర్చుకోవాలని శ్రీ వెంకట విద్యాగిరి పాఠశాల కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం పుస్తక దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుస్తక పఠనంతో విజ్ఞానం, మనో వికాసం వృద్ధి చెందుతాయని చెప్పారు. పాఠ్యపుస్తకాల అధ్యయనంతో పాటు ఇతర పుస్తకాలు కూడా అధ్యయనం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

ఆరోగ్యవంతమైన గ్రామంగా గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురం మన్యం జిల్లాలో గుమ్మలక్ష్మీపురం గ్రామం ఆరోగ్యవంతమైన గ్రామంగా గుర్తింపు పొందింది. రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో ఉత్తమ గ్రామ పంచాయతీలను ప్రకటించిన నేపథ్యంలో ఆరోగ్యవంతమైన గ్రామ పంచాయతీ విభాగం (థీమ్ 2)లో గుమ్మలక్ష్మీపురం గ్రామ పంచాయతీకి మొదటి ర్యాంక్ లభించింది. పంచాయతీ సర్పంచ్‌గా బొత్తాడ గౌరీ శంకర్ రావు ఎన్నికైన తర్వాత పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్నారు. ఇందుకోసం గ్రామస్తులు, వార్డు మెంబర్లు, పారిశుధ్య కార్మికులు, వాలంటీర్లతో ఎప్పటికప్పుడు సమావేశమై సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించడంలో సర్పంచ్ చర్యలు చేపడుతున్నారు. ప్రతిరోజు ప్రతి వీధిలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడం ద్వారా పారిశుధ్య గ్రామంగా మెరుగుపరుస్తున్నారు. తద్వారా దోమల వ్యాప్తి నివారణతో పాటు వ్యాధులు తగ్గుముఖం పట్టాయి. భవిష్యత్తులో ఉత్తమ గ్రామంగా ఎంపిక కావాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.




క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న మోహనరావు

జనసేన కార్యకర్తలపై దాడి అమానుషం

పార్వతీపురం : బెవరపేటలో జనసేన కార్యకర్తలపై దాడి అమానుషమని నియోజకవర్గ జనసేన నాయకులు అక్కివరపు మోహనరావు, పాలూరు బాబు ఖండించారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివారం ఆయన పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. పోలీసు శాఖ నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు సందడి చేశారు. పార్కులోని అందాలను ఆస్వాదించారు. యువతి యువకులు హ్యాంగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. జలవిహార వద్ద బోటు షికారు చేశారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఆడుకున్నారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో సరదాగా గడిపారు. గైరో ఎక్కి గుండ్రంగా తిరిగారు. ఆనంద్ విహార వద్ద డాన్సులు వేశారు. అనం తరం మెట్ట గూడ జలపాతాన్ని సందర్శించారు.



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పశు నష్టపరిహార పథకానికి మంగళం?

మూడేళ్లుగా రైతులకు అందని పరిహారం

ప్రజాశక్తి - సీతంపేట

వ్యవసాయ రంగానికి అనుబంధంగా పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ మూడేళ్లుగా ఒక పైసా విదల్చలేదు. దీంతో పశునష్ట పరిహారం అందక బాధిత పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా నీరుగారుస్తూ భవిష్యత్తులో ఈ పథకానికి మంగళం పాడే అవకాశాలున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే జరిగితే రైతులు పాడి పెంపకంపై ఆశలు వదుకోవాల్సిందే.

సీతంపేట పశుసంవర్ధశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం పరిధిలో సీతంపేట, భామిని పశు సంపద గణాంకాల ప్రకారం ఆవులు 22110, గేదెలు 3998, గొర్రెలు 16090, మేకలు 21992, కోళ్లు 91000 ఉన్నాయి. వీటిలో సీతంపేట మండలంలో ఆవులు 13,063, గేదెలు 1828, గొర్రెలు 7,795 మేకలు 16,057, కోళ్లు 64,310 ఉన్నాయి. పశునష్టపరిహార పథకంలో నాటు ఆవుకు రూ.15వేలు, జెర్సీ ఆవుకు రూ.30వేలు, మేక, గొర్రెలకు 6వేలు చొప్పున నష్టపరిహారం ఇచ్చేవారు. ఈ మూడేళ్లలో సీతంపేటలో 20, భామినిలో వందకు పైగా పశువులు మృతి చెందగా, సంబంధిత రైతులకు ఒక్కపైసా నేటికీ రాలేదు. ముందుగా పశువు మృతి చెందుతూ రైతు భరోసా కేంద్రానికి తెలియజేస్తే ఎహెచ్ఎ పరిశీలించి పశు వైద్యా అధికారి పోస్టుమార్టం రిపోర్ట్ తయారు చేసి ఎడి లాగిన్ ద్వారా పశుసంర్ధకశాఖ జెడికి పంపిస్తారు. అప్పుడు పరిహారం వచ్చేది. ప్రస్తుతం ఈ పరిస్థితి కనిపించడం లేదు. మూడేళ్లు కావస్తున్నా పరిహారం అందక పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పశు సంవర్ధశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తావించగా ప్రభుత్వం నుంచి బడ్జెట్ రాలేదని, ఇప్పటికే ప్రభుత్వం దృష్టిలో పెట్టామని వివరణ ఇచ్చారు.




బిత్రపాడులో గడపగడపకు..

ప్రజాశక్తి - జియమ్మవలస

మండలంలోని బిత్ర పాడు పంచాయతీలో కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి గడపగడపకు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సంక్షేమ పథకాల అందుతున్న తీరు గురించి లబ్ధిదారులను ప్రశ్నిస్తూ వారికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ గడపగడపకు తిరిగారు. ప్రతి ఏటా ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంలో పథకాలు అందుతున్నాయని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం శశికళ, వైస్ ఎంపిపి గుడివాడ సంపత్ కుమార్, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ ఏం గౌరీ శంకర్రావు, డిసిసిబి డైరెక్టర్ లొలుగు నారాయణరావు, స్థానిక సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు, తదిరతులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని వెంకంపేట పంచాయితీలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం కొనసాగించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవాలని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో లబ్ధిదారుల ఇళ్లకే పథకాలు అందిస్తున్న ప్రభుత్వం తమదని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బలగ రేవతి, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం భాగ్యలక్ష్మి, స్థానిక సర్పంచ్ తీళ్ళ కృష్ణారావు, నాయకులు బి.కృష్ణమూర్తి, బలగ నాగేశ్వరరావు బొమ్మి రమేష్, చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



శివునాయుడుకు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే జోగారావు

పిఎసిఎస్ చైర్మన్‌గా శివున్నాయుడు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని పెదబొండపల్లి పిఎసిఎస్ చైర్మన్‌గా సీనియర్ వైసిపి నాయకులు తీళ్ల శివున్నాయుడు పదవీ స్వీకారం చేశారు. ఆదివారం ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని పెద్ద సంఘమైన ఈ పిఎసిఎస్‌లో ఎక్కువ మందికి రైతులకు సేవలందించే అవకాశం ఉందని, రైతు భరోసా కేంద్రాలను అనుసంధానం చేసుకొని రుణాలు, ఎరువుల పంపిణీ, వ్యవసాయ పరికరాలు అందుచేత సక్రమంగా నిర్వహించి పార్టీకి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బలగ రేవతి, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, నాయకులు బలగ నాగేశ్వరరావు, భీమవరపు కృష్ణమూర్తి, బొమ్మి రమేష్, చందాన శివాజీ, సవరపు రాజారావు, మజ్జి చంద్రశేఖర్, మడక విశ్వనాథం, గండి శంకరరావు, బోను రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బోర్డు సరే... భవనమేదీ?



జనవీధిలో భవనం లేకపోయినా ఏర్పాటు చేసిన బోర్డు

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైయస్సార్ హెల్త్ క్లినికల్ నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మండలంలో వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌లు ఉన్నాయి. మండలంలోని 24 సచివాలయాల పరిధిలో నడుకూరు, సంతనర్సిపురం, వండువ, హుస్సేన్‌పురం, కత్తుల కవిటి గ్రామాల మినహా ఎక్కడ కూడా వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి రాకపోవడంతో 104 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు చెట్లనీడలో, ఇరుకైన భవనాల్లో, టెంట్లు కింద, పశువుల శాలలో తదితరమైన చోట్ల వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. దీంతో రోగులు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరఘట్టం సచివాలయం-1 పరిధిలోని జనవీధి సమీపాన వైయస్సార్ హెల్త్ క్లినిక్ కోసం స్థలాన్ని సమీకరించినప్పటికీ అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోయినా బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ప్రస్తుతం వైయస్సార్ క్లినిక్ శ్లాబ్ దశకు చేరుకుంది. నీలానగరంలో ఇటీవలే కోటి రూపాయలతో వసతి గృహం నిర్మించినప్పటికీ అక్కడ విద్యార్థులు లేకపోవడంతో ప్రస్తుత ఆ భవనంలో వైయస్సార్ క్లినిక్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వైయస్సార్ క్లినిక్ బోర్డులకు పరిమితం కాకుండా పక్కా భవన నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజన గ్రామాల్లో జగనన్న మా భవిష్యత్తు

సీతంపేట : మండలంలోని టిటుకుపాయి సచివాలయం పరిధిలో టిటుకుపాయిగూడ, టిటుకు పాయి గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా టిటుకుపాయి, మానాపురం సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, వార్డ్ సభ్యులు, వాలంటీర్లు, గ్రామ పెద్దలు జగనన్న సంక్షేమ ఫలాలు అవగాహన కల్పించారు. రాబోయే రోజుల్లో జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలను కోరారు

ప్రతిభా కళాశాలల ప్రవేశ పరీక్ష

సీతంపేట: మండలంలోని మల్లిలో ఉన్న ప్రతిభ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, ప్రతిభ పాఠశాలలో 8వ తరగతి ప్రవేశానికి ఆదివారం సీతంపేట బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. వీటిలో కళాశాలకు 226 మంది విద్యార్థులు హాజరు కాగా, 8వ తరగతి ప్రవేశానికి 113 మంది విద్యార్థులు హాజరయ్యారు. భామిని ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ కె. సురేష్ అబ్జర్వర్‌గా పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు.

ప్లాస్టిక్ నిషేధానికి తూట్లు

విచ్చలవిడిగా విక్రయాలు, వాడకాలు

కానిరాని అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పార్వతీపురాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా మార్చేందుకు మున్సిపల్ పరిధిలో పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ విక్రయాలను వాడకాలను గత ఏడాది నవంబర్ 1 నుంచి నిషేధించినట్లు మునిసిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది, సచివాలయాల శానిటరీ సెక్రటరీలు కొన్ని రోజులు మాత్రమే ఆదరా బాదరాగా ప్లాస్టిక్ విక్రయాలు, వాడకాలపై సోదాలు నిర్వహించి వ్యాపారస్తుల నుంచి అపరాధ రుసుము వసూలు తూతూ మంత్రంగానే చేశారు తప్ప పూర్తిస్థాయిలో నిషేధానికి చర్యలు చేపట్టలేదు. దీంతో పట్టణంలో పలుచోట్ల ఉన్న వ్యాపార సముదాయాల్లో నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నాయి. దీంతో మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరాన గల పుట్పాత్ వ్యాపారులతో పాటు, చికెన్, మటన్ వ్యాపారస్తులు, రైతు బజార్లోనూ, చిన్న, చిన్న బడ్డీ షాపుల్లోనూ ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు బహిరంగంగానే విక్రయాలు చేస్తున్నప్పటికీ సంబంధిత మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు గానీ, వార్డు సచివాలయాల శానిటరీ సెక్రటరీలు పట్టించుకోవడంలేదు. దీంతో సంబంధిత వ్యాపారులు బరితెగించి అమ్మకాలు, వాడకాలు చేపడుతున్నారు. ఎప్పటికైనా మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు సచివాలయాల సెక్రటరీలు ప్లాస్టిక్ విక్రయాలు వాడకాలపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి పార్వతీపురాన్ని ప్లాస్టిక్ రహిత పార్వతీపురంగా తీర్చిదిద్దాలని పట్టణ ప్రజలతో పాటు, పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, వాకర్స్ క్లబ్ సభ్యులు కోరుతున్నారు.



విక్రయానికి తీసుకెళ్తున్న ప్లాస్టిక్ గ్లాసులు

కబ్జా చెర నుంచి చెరువులను రక్షించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని బెలగాంలో కబ్జాకు గురవుతున్న లక్ష్మనాయుడు చెరువు, నలితిమివాని చెరువు (చాకలి చెరువు) చెరువులను పరిరక్షించాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నాయకులు కోరారు. ఆదివారం ఆ సమితి నాయకులు మాట్లాడుతూ అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలు, చెరువులు కబ్జా చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా బెలగాం రైల్వే గేటు పక్కనే ఉన్న లక్ష్మంనాయుడు చెరువును ఓ రాజకీయ నాయకుడు కబ్జా చేశాడని ఆరోపించారు. దీనిలో భాగంగా చెరువులో పట్టాలను కూడా తీసుకున్నట్లు ఆరోపించారు. అలాగే రైల్వే పట్టాలు పక్కనే ఉన్న 557-2 సర్వే నెంబర్‌లో గల, 3.81 ఎకరాల విస్తీర్ణం, 14.50 ఎకరాల ఆయకట్టు కలిగిన నళితిమి వాని చెరువు (చాకలి చెరువు) కూడా గత రెండు రోజులుగా మరో బడా వ్యక్తి ఆక్రమణకు పాల్పడుతున్నారన్నారని చెప్పారు. తక్షణమే అక్రమార్కుల చెరనుండి ఆ రెండు చెరువులను రక్షించాలన్నారు. కళ్లముందే చెరువులను చదును చేసి, మట్టి పోసి కబ్జా చేస్తుంటే సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నార న్నారు. కబ్జాదారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో పార్వతీపురంలో కోట్లాది రూపాయలు విలువచేసే చెరువులు కబ్జాకు గురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కబ్జాదారుల నుంచి చెరువులను రక్షించి, చెరువుల ద్వారా పర్యావరణాన్ని భూగర్భ జలాలను రక్షించాలని పరిరక్షణ సమితి జిల్లా, పట్టణ, మండల అధ్యక్షులు వి.దాలినాయుడు, ఎస్.భాస్కరరావు, బలగ శంకరరావు కోరారు.



గోచెక్కలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

సంక్షేమ పథకాల పేరుతో అప్పల పాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

అధికారంలోకి వస్తే ప్రజలను ఉద్ధరిస్తామని మాయ మాటలు చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పథకాల పేరిట రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులు అన్నారు. ఆదివారం పార్వతీపురం మండలం, గోచక్క పంచాయితీ డెప్పి వలస, కొసరి వానివలసలలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదాయానికి మించి అప్పులు చేసి రాష్ట్ర జనాభా పై రుణభారం పెంచడమే కాకుండా, మారుమూల గిరిజన గ్రామాలు, దళితవాడలలో కనీస అభివృద్ధి లేకుండా చేసి వారికి మౌలిక సదుపాయాలకు దూరంగా ఉంచుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాలలో అభివృద్ధి పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా చేసి, మండలంలోని పలు గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేకుండా చేశారని అన్నారు. తాము అధికారంలో ఉండగా తీసుకువచ్చిన జల జీవన్ పనులు కూడా పూర్తిస్థాయిలో చేయించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, బోను చంద్రమౌళి, రెడ్డి చిన్నమనాయుడు, బేత లక్ష్మణరావు, శ్రీధర్ భుడితి శ్రీరామ్, బంకపల్లి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీగా పెదగొత్తిలి

కురుపాం : ప్రభుత్వం వివిధ భాగాల్లో ఉత్తమ పంచాయతీలుగా ఆదివారం విడుదల చేసిన పంచాయతీల్లో మండలంలో గల పెద గొత్తిలి పంచాయతీకి స్వయం సంవృద్ధి మౌలిక వసతులు కలిగిన ఉత్తమ పంచాయతీగా చోటు దక్కించుకుంది. ఈ సందర్భంగా సర్పంచ్ టి. లోకనాథం మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం విడుదల చేసిన 14 ఉత్తమ పంచాయతీల్లో తమ పంచాయతీకి చోటు దక్కడం చాల గర్వకారణంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి అన్ని విభాగాల్లో ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ,ప్రజా ప్రతినిధులు సర్పంచ్, వార్డు మెంబర్లకు, సచివాలయ సిబ్బంది, అభినందనలు తెలిపారు.

300 మంది గిరిజనులకు వైద్య సేవలు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ శ్రీరాములు, డిఎంహెచ్ఒ జగన్నాథరావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లా రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని తాడికొండ గ్రామంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 300 మంది గిరిజనులకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ జగన్నాథం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రెడ్ క్రాస్ చైర్మన్ మంచు పల్లి శ్రీరాములు శిబిరం ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. తమ ఆరోగ్య శాఖ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి డాక్టర్ నగేష్ రెడ్డి 60 మంది నేత్ర రోగులకు పరీక్షలు జరిపి 10 మందికి శస్త్ర చికిత్సలు, 16 మందికి కళ్ల జోళ్లు కోసం సిఫార్సు చేశారు. సాధారణ వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ మెగా వైద్య శిబిరంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ప్రభాకరరావు, డాక్టర్ బుద్ధేశ్వరరావు రోగులకు సేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడి కొండ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యాధికారికి సన్మానం

గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో సేవలు అందిస్తున్న కంటి వైద్య నిపుణులు నగేష్ రెడ్డికి తాడికొండ గ్రామంలో రెడ్ క్రాస్ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. గత కొన్నేళ్ల నుంచి ఏజెన్సీ ప్రాంతంలో కంటి చూపుతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందిస్తూ శస్త్ర చికిత్సలకు పంపించడం ద్వారా వారి కళ్ళల్లో వెలుగు నింపుతున్నారని సభ్యులు కొనియాడారు. ఇంకా విస్తృతంగా సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీరాములు, సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇప్పల పోలమ్మ అమ్మవారికి వెండి హారం వితరణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని గ్రామ దేవత ఇప్పల పోలమ్మ అమ్మవారికి ఆదివారం పట్టణానికి చెందిన నల్లబిల్లి రవీంద్ర సుమారు 100 గ్రాముల వెండి హారాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఈ మేరకు నిర్వాహకులు రవీంద్రకు అభినందనలు తెలిపారు.



హారాన్ని అందజేస్తున్న రవీంద్ర

పైడితల్లమ్మ జాతరకు పోలీసు బందోబస్తు

వీరఘట్టం : ఈనెల 30 నుంచి మే10 వరకు నిర్వహించనున్న శ్రీ పైడితల్లి అమ్మవారి జాతరకు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం పైడితల్లి అమ్మవారి ఆలయ ఆవరణలో ఉత్సవ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రధాన రహదారి మీదుగా ఎటువంటి ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రజలు సహకారం కూడా ఎంతో అవసరం మని ఆ దిశగా ఉత్సవ కమిటీ కూడా చొరవ చూపాలన్నారు. అనంతరం పైడితల్లి అమ్మవారికి డిఎస్‌పి, సిఐకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ కిషోర్ వర్మ, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చింతాడకు చెందిన సవర చిన్నారావు మెట్టుగూడ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతాడకు చెందిన సవర చిన్నారావు ద్విచక్ర వాహనంపై శనివారం సాయంత్రం సీతంపేట వైపు వస్తుండగా, మెట్టుగూడ జంక్షన్ వద్ద కొత్తూరు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో చిన్నారావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ హాస్పిటల్‌కు తరలించారు అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై ఎ.నీలకంఠరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి

వృద్ధురాలు ఆత్మహత్య

సీతంపేట : మండలంలో ఆడాలికి చెందిన తుండంగి చెంచమ్మ (76) శనివారం గన్నేరు పిక్కలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. సీతంపేట మండలం ఆడాలికి చెందిన తుండంగి చెంచమ్మకు ముగ్గురు కుమారులకు ఇద్దరు, భర్త కూడా చనిపోవడంతో ఒంటరితనాన్ని భరించలేక శనివారం సాయంత్రం గన్నేరు పిక్కలు నూరుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న చెంచమ్మను వెంటనే కుమారుడు సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనిపై పాలకొండ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం తరలించారు. ఎస్సై ఏ నీరకంఠరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి -విజయనగరం

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మే 3న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సిఎం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో పర్యటనా ఏర్పాట్లపై కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు సిఎం కార్యక్రమం ప్రారంభమవు తుందని చెప్పారు. బహిరంగ సభ, ఆడియన్స్ గ్యాలరీ, పార్కింగ్ తదితర ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఎండ తీవ్రత బాగా ఉన్నందున ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. ఎస్‌పి దీపిక మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమానికి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తామని చెప్పారు. సభకు వచ్చేవారు ఇబ్బంది పడకుండా, వీలైనంత వరకు సభా ప్రాంగణానికి సమీపంలోనే పార్కింగ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో జెసి మయూర్ అశోక్, డిఆర్‌ఒ ఎం.గణపతి రావు, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ పాల్గొన్నారు.